సాక్షి
కామారెడ్డి
సోమవారం। 28। అక్టోబర్। 2024



రాయితీ సిలిండర్ల పక్కదారి

రాయితీ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. వాణిజ్య అవసరాలకు గృహావసర సిలిండర్లు వాడుతున్నారు.

- 8లో ▸



పేరుకుపోతున్న ధాన్యం

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా ఇప్పటికీ కాంటాలు ప్రారంభించలేదు. దీంతో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.2 /16.6

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏటీసీలో విద్యార్థులను చేర్పించాలి



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో కొత్తగా ప్రారంభమైన ఏటీసీ అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులపై విద్యార్థులకుఅవగాహన కల్పించి ప్రవేశాలు ఇప్పించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. ఆదివారం ఆమె ఐటీఐ కళాశాలను సందర్శించి అడ్మిషన్ల ప్రక్రియపై ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకొని గ్రామాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. రెండు రోజుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

డివైడర్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి క్రైం: పట్టణంలోని జీవీఎస్ కళాశాల ఎదురుగా ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చడాన్ని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్రంగా ఖండించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి డివైడర్‌ను కూల్చిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మకు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివైడర్ కూల్చివేతతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, పునర్నిర్మించాలని కోరారు.

నేడు బాధ్యతల స్వీకరణ

భిక్కనూరు: బస్వాపూర్ సింగిల్‌విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ మద్ది స్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా సహకార శాఖాధికారి రామ్మోహన్ 'సాక్షి'తో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం బస్వాపూర్ సింగిల్‌విండో పాలక వర్గాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. బస్వాపూర్ సింగిల్‌విండో విభజన జరిగినప్పటికీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం పాత పాలకవర్గ సభ్యులే కొనసాగనున్నారు.

కుల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



రెంజల్(బోధన్) : కుల రహిత సమాజాన్ని నిర్మించుకుందామని పలువురు స్వామీజీలు అన్నారు. మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో లోక్‌మాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా పూజ్య ధర్మాచార్యుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు స్వామీజీలు మాట్లాడుతూ.. హిందూ సమాజ ఐక్యత, పరివర్తనలో ప్రధాన పాత్ర దేశంలోని సాధుసంతులదేనని అన్నారు. దేశ, ధర్మ రక్షణకు యువత ముందుండాలన్నా రు. అనంతరం గోదావరి నదికి మహాహార తి అందించారు. కార్యక్రమంలో స్వామీజీలు సిద్దేశ్రానంద, సిద్దానంద, అనంతగిరి, సంగ్రామ్ మహారాజ్, గుడిమెట్ల స్వామీజీ, యంచ మాతానంద స్వర్ణకమలాక్షితోపాటు సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు శీనునా యక్, కొత్త సృజన్‌రెడ్డి, హరిదాసు పాల్గొన్నారు.


ఈనెల 30 వరకు 'ఓపెన్'కు అవకాశం

బాన్సువాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30 వరకు అవకాశం ఉందని బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, అధ్యయన కేంద్రం సమన్వయకర్త శంకర్ తెలిపారు. ఇంటర్మీడియెట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర రెండేళ్ల కోర్సు పూర్తిచేసిన వారు నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

స్కానింగ్ మాఫియాకు అడ్డేది?

లింగ నిర్ధారణ పరీక్షలకు కామారెడ్డి జిల్లా కేంద్రం కేరాఫ్‌గా మారింది. మూడు, నాలుగేళ్లుగా విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. డెకాయ్ ఆపరేషన్లు చేసినా, నిందితులు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కుతున్నా.. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని అక్రమార్కులు సులువుగా బయటపడుతున్నారు.

- కామారెడ్డి కేంద్రంగా జోరుగా లింగ నిర్ధారణ పరీక్షలు
- వరుసగా నమోదవుతున్న కేసులు
- మరో రెండు స్కానింగ్ మిషన్లు పట్టివేత
- కఠిన చర్యలు లేకపోవడంతో ఆగని దందా



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాకేంద్రంలోని శ్రీరాం నగర్ కాలనీలోగల కౌసల్య ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు 2021 జూలై 15న పక్కా ప్లాన్‌తో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. అప్పుడు ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రి నిర్వాహకుడు ఇట్టం నడిపి సిద్దరాములుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. అయితే కౌసల్య ఆస్పత్రి సీజ్ అయిన కొంత కాలానికే ఆస్పత్రి యాజమాన్యం అధికారులను మచ్చిక చేసుకుని అక్కడికి సమీపంలో నిర్మించిన సొంత భవనంలో సమన్విత ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో మరో ఆస్పత్రిని ప్రారంభించింది. దీనికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అనుమతి లభించింది. అలాగే స్కానింగ్ సెంటర్ కోసం గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షల చట్టం (పీసీ అండ్ పీఎన్‌డీటీ) అనుమతి కూడా ఇచ్చారు. అయితే స్కానింగ్ సెంటర్‌లో కచ్చితంగా రేడియోలజిస్టు ఉండాలి. లేదంటే గైనకాలజిస్టు శిక్షణ పొంది ఉండాలి. కానీ రికార్డుల్లో నమోదు చేసిన వైద్యులెవరూ ఇక్కడ పనిచేయరు. అప్పటికే కేసుల్లో ఇరుక్కున్న యాజమాన్యం కొత్తగా మరో పేరుతో ఆస్పత్రి పెడుతున్నపుడు అనుమతులు ఇచ్చే విషయంలో వైద్యారోగ్య శాఖ అధికారులు అదేమీ పట్టించుకోలేదు. ఈ ఏడాది జూలైలో అదే ఆస్పత్రి కేంద్రంగా అప్పుడే పుట్టిన శిశువును విక్రయించారన్న ఆరోపణలపై డీసీపీవో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్విత ఆస్పత్రిని సీజ్ చేశారు. అయితే ఆస్పత్రి యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుంది. దీంతో అధికారులు సీజ్‌ను తొలగించారు. ఇంకేముంది దందా మళ్లీ మొదలైంది.

మహారాష్ట్రలో కేసు..

లింగ నిర్ధారణ కేసులో మహారాష్ట్ర పోలీసులు నెల క్రితం కామారెడ్డికి వచ్చి సమన్విత ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి వైద్యుడు ప్రవీణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైద్యుడైన ప్రవీణ్ కుమార్‌పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శాఖాపరమైన చర్యల్లో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేశారు.

మొబైల్ స్కానింగ్ ముఠా..

రాజంపేట మండల కేంద్రంలో ఓ మొబైల్ స్కానింగ్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఇంటి వద్దకే వెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండడం తెలిసి అందరూ షాక్ అయ్యారు. స్కానింగ్ చేస్తున్నవారిని అరెస్టు చేశారు.

పొరుగురాష్ట్రాల నుంచీ రాక

కామారెడ్డిలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతాయన్నది బహిరంగ రహస్యం. దీంతో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి కూడా చాలా మంది వస్తుంటారు. కర్ణాటక, మహారాష్ట్రల్లోని వివిధ ప్రాంతాల్లో కొందరిని దళారులుగా పెట్టుకుని లింగ నిర్ధారణ పరీక్షల దందా నడిపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్ నుంచి కూడా లింగ నిర్ధారణ పరీక్షల కోసం చాలామంది వస్తున్నారు. ఇక్కడి అధికారులు గట్టి చర్యలు తీసుకోకపోవడం, చట్టాల్లోని లొసుగులను ఆసరా చేసుకుని లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

ఉన్నత స్థాయి అధికారులు రంగంలోకి దిగితే తప్ప అడ్డుకట్ట పడేట్టు కనబడడం లేదు. లింగ నిర్ధారణ పరీక్షల మూలాలన్నీ కామారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీరాంనగర్ కాలనీలోనే ఉంటున్నాయి.

స్కానింగ్ యంత్రాలను తరలిస్తూ..

లింగ నిర్ధారణ పరీక్షల కేసులలో ఇప్పటికే రెండు పర్యాయాలు అరెస్టయిన వ్యక్తులు.. మూడు రోజుల క్రితం కారులో స్కానింగ్ మిషన్ తీసుకువెళుతుండగా కామారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా మరో మిషన్ కూడా ఉందని తెలిసింది. దీంతో శ్రీరాంగనగర్ కాలనీలోని ఓ ఇంటికి వెళ్లి అక్కడ దాచిన స్కానింగ్ మిషన్‌ను సీజ్ చేశారు. పోలీసులు వాటిని ఆర్డీవో సమక్షంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు అప్పగించారు. అయితే పట్టుకున్న మిషన్ గతంలో చిక్కిన ముఠాకు చెందినదే కావడం గమనార్హం. తాజాగా చిక్కిన రెండు మిషన్లు కూడా అదే ముఠాకు చెందినవిగా తేలింది.

దీంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు నివేదించారు. అయితే అనుమతులు లేకుండానే స్కానింగ్ మిషన్లు కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనకడుగు వేస్తుండడం విస్మయం కలిగిస్తోంది.



కారులో తరలిస్తున్న స్కానింగ్ యూనిట్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు (ఫైల్)

పూర్వీకులు అందించిన అద్భుత విద్య యోగా

కామారెడ్డి అర్బన్: పూర్వీకులు మనకు అందించిన అద్భుతమైన విద్య యోగా అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని యోగా భవన్ ప్రథమ వార్షికోత్సవాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్, పట్టణంలోని వివిధ యోగా అసోసియేషన్లు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తూ వెలకట్టలేని సేవలు అందిస్తున్నాయని ప్రశంసించారు. ప్రధానిగా నరేంద్రమోడీ కృషితో యోగాకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో అవార్డులు పొందిన క్రీడాకారులను శాలువా, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, యోగాచార్యులు గరిపల్లి అంజయ్య గుప్తా, ప్రతినిధులు పి.అంజయ్య, యెల్లంకి సుదర్శన్, రఘుకుమార్, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యోగాసాధకులతో కామారెడ్డి ఎమ్మెల్యే కె వెంకటరమణారెడ్డి, తదితరులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బిచ్కుంద(జుక్కల్): గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీపీవో శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్ర గ్రామపంచాయతీతోపాటు ఐటీఐ కళాశాల ఏటీసీ సెంటర్‌ను డీపీవో ఆదివారం సందర్శించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి వీధులలను శుభ్రంగా ఉంచాలని కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిచ్కుంద ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి పాసైన విద్యార్థులు ఏటీసీలో అడ్మిషన్లు పొందేవిధంగా చూడాలని కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. నియోజక వర్గంలోని విద్యార్థులు ఏటీసీ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయనవెంట డీఎల్‌పీవో నాగరాజ్, కార్యదర్శులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు

బండికి భద్రత కరువు



కామారెడ్డిలోని దుకాణాల ముందు పార్క్ చేసిన బైక్‌లు

- పనిచేయని సీసీ కెమెరాలు
- జిల్లాలో పెరుగుతున్న బైక్ చోరీలు
- షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, బార్‌ల వద్దనుంచి చోరీ
- రాత్రి వేళ ఇళ్ల ముందు నుంచి ఎత్తుకెళ్తున్న దుండగులు

కామారెడ్డి క్రైం: బండికి భద్రత లేకుండా పోయింది. జిల్లాలో బైక్ చోరీల సంఖ్య పెరుగుతూనే ఉంది. గతంలో ఇళ్ల ముందు నిర్లక్ష్యంగా పార్కింగ్‌చేసిన బైక్‌లను దుండగులు టార్గెట్ చేసేవారు. కానీ ఇప్పుడు ఎక్కడి నుంచి పడితే అక్కడి నుంచి బైక్‌లను ఎత్తుకెళ్తున్నారు. షాపింగ్ మాల్స్, దుకాణాలు, బార్‌లు, ఆస్పత్రులు, ఆలయాలు, బస్టాండ్‌లు ఇలా ఎక్కడ పార్క్ చేసినా వచ్చేసరికి బైక్ ఉంటుందా? లేదా? అనేది గ్యారెంటీ లేదు. జిల్లా కేంద్రంలో బైక్ చోరీలు ఎక్కువగా అవుతుండడానికి సీసీ కెమెరాలు సక్రమంగా లేకపోవడమే కారణమంటున్నారు.

నిత్యం వెలుగు చూస్తున్న ఘటనలు..

జిల్లాలోని ఆయా పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల నుంచి వివిధ ప్రాంతాల ప్రజలు పనుల నిమిత్తం జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణానికి వస్తుంటారు. ఎక్కువ మంది బైక్‌లపైనే రావడంతో ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, బార్‌లు, బ్యాంకులు తదితర ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇదే అదనుగా దుండగులు బైక్‌లను టార్గెట్ చేస్తున్నారు. బైక్ చోరీలకు సంబంధించి పలు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే దుండగులు ఎవరికీ అనుమానం రాకుండా ఉద్యోగుల మాదిరిగా మంచి దుస్తులు ధరించి వచ్చినట్లు స్పష్టమైంది. గడిచిన 20రోజుల్లో పట్టణంలోని ఒక్క జయ ఆస్పత్రి ఎదుట నుంచే ఆరు బైకులు చోరీకి గురైనట్లు తెలిసింది.

జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

జిల్లాలో మొత్తం 23 పోలీస్ స్టేషన్‌లు ఉండగా, కామారెడ్డితోపాటు ఆయా పీఎస్‌ల పరిధిలో నెలకు పదుల సంఖ్యలో బైక్‌లు చోరీ అవుతున్నాయి. చాలా మట్టుకు బైక్ చోరీలకు సంబంధించిన పిర్యాదులపై కేసులు సైతం నమోదు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో బైక్ చోరీలకు సంబంధించిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గతంలో బైక్ చోరీ జరిగిందని ఫిర్యాదు వస్తే పోలీసులు సీరియస్‌గా తీసుకునేవారు. ఒక కేసును పట్టుకుని ముందుకు వెళితే పెద్ద ఎత్తున బైక్‌లు రికవరీ అయ్యేవి. ఈ మధ్య బైక్ చోరీలపై పోలీసులు అంతగా దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

లోపించిన నిఘా

జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా మారింది. సీసీ కెమెరాలు సక్రమంగా లేక బైక్ కేసుల దర్యాప్తు వేగం పుంజుకోవడం లేదు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంబడి సీసీ కెమెరాలు సక్రమంగా పని చేయడం లేదు. గతంలో కొన్ని ముఠాలు మాత్రమే బైక్‌లు చోరీ చేసేవి. ఇప్పుడు ఈజీ మనీ కోసం పలువురు యువత సైతం బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ముఠాలు కామారెడ్డి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జరిగిన చోరీల్లో పట్టుబడిన నిందితుల్లో ఎక్కువ మంది స్థానికేతరులు ఉన్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

ఫిర్యాదు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నాం. గతంలో కూడా చాలా బైక్‌లు రికవరీ చేశాం. పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించడంతో పాటు పెద్ద ఎత్తున సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– రాజు, ఎస్సై, దేవునిపల్లి

క్లుప్తంగా

‘102 సేవలను వినియోగించుకోవాలి’



కామారెడ్డి అర్బన్: గర్భిణులు, బాలింతలు 102 అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని 102 జిల్లా మేనేజర్ మధుకుమార్, ఈఎంఈ తిరుపతి సూచించారు. కామారెడ్డి, రామారెడ్డి, ఎల్లారెడ్డి, ఎర్రాపహాడ్, రాజంపేట, సదాశివ నగర్ ప్రభుత్వ ఆస్పత్రులకు గర్భిణులను తీసుకువస్తున్నామని, చెకప్ అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తున్నామని పేర్కొన్నారు. బాలింతలను ఇంటికి చేర్చడం, ప్రసవం అనంతరం కుట్లు తీయడానికి ఆస్పత్రికి తీసుకురావడం వంటి సేవలనూ అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు 102 సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో 102 పైలట్లు శ్రవణ్‌కుమార్, స్వామి, దళపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా కేవలం ఒక డీఏ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విచారకమని ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. ఆదివారం ఈ మేరకు డీటీయూ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌జీటీలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యదర్శి హరికిషన్, జిల్లా నాయకులు శంకర్, తిరుపతి, దేవందర్, లక్ష్మణ్, స్వామి, సాయిలు ఉన్నారు.

శిక్షణ తరగతులకు అంబేడ్కర్ సంఘం నేతలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డికి చెందిన అంబేడ్కర్ సంఘం నాయకులు ఆదివారం కామారెడ్డికి తరలివెళ్లారు. కామారెడ్డిలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి శిక్షణా కార్యక్రమం నిర్వహించనుండటంతోతరగతులకు హాజరయ్యేందుకు వెళ్లారు. నాయకులు బిట్ల సురేందర్, సాయిబాబా తదితరులున్నారు.

నూతన రేషన్ డీలర్లకు షాపుల కేటాయింపు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో నూతనంగా ఎంపికైన రేషన్ డీలర్లకు నవంబర్ నెల నుంచి రేషన్ కోటాను అందజేయనున్నట్లు ఆర్డీవో రంగనాథ్‌రావు ఆదివారం పేర్కొన్నారు. భిక్కనూరు మండలంలోని గుర్జకుంట బాల రణదీప్‌రెడ్డి, కాచాపూర్ కమ్మరి వాసవి, భాగిర్తిపల్లి గొంద్ర అశోక్, భిక్కనూర్ కర్నాల శ్రీను, బస్వాపూర్ కొదండం స్వరూప, దోమకొండ మండలంలోని చింతామాన్‌పల్లి గ్రామంలో వంజరి శివరాజు, సంగమేశ్వర్‌లో కుమ్మరి దేవేందర్, కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డిలో బాయికాడి రజితబాయి, ఏలూరి శేఖర్, కామారెడ్డి పట్టణంలో కె నరహరి, సబ్బని జయశ్రీ, నారాయణ్‌కర్ కల్యాణచక్రవర్తి, యాచం సంతోష్, నీల ఫణీంద్ర, బట్టు మధుకుమార్, పల్వంచ మండలం పోతారం గ్రామంలో లలిత, ఎల్పుగొండలో నాదియా సానా, రాజంపేట మండలంలో తలమడ్ల గ్రామంలో కమ్మరి దుర్గాప్రసాద్, రాజంపేటలో నాయిని రాధ, దుబ్బని నితీషాలకు నవంబర్ నుంచి రేషన్ షాపులు కేటాయించనున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన డీలర్లు సమయానుకూలంగా ప్రజలతో స్నేహభావంతో ఉండి ప్రభుత్వం అందిస్తున్న సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

బ్రాహ్మణ్‌పల్లిలో బైక్ చోరీ

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లిలో జగడం రమేశ్‌కు చెందిన బైక్ చోరీ జరిగింది. రమేశ్ తన ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైక్‌ను దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దారి తప్పుతున్న సిలిండర్లు

- వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ అమ్మకం
- వినియోగదారుల పేరిట బుక్ చేసి ఇతరులకు విక్రయిస్తున్న డీలర్లు
- మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు
- పట్టించుకోని అధికారులు



జిల్లా వ్యాప్తంగా..	
గ్యాస్ ఏజెన్సీలు	19
మహాలక్ష్మి లబ్ధిదారులు	లక్షా43వేల 899
సింగిల్ సిలిండర్లు	లక్షా 13వేలు
డబుల్ సిలిండర్లు	89 వేల 350
దీపం పథకం	60 వేల 650
సీఎస్ఆర్	30 వేల 860
ఉజ్వల	39 వేల 233
కమర్షియల్	1045

సదాశివనగర్: జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. డీలర్లు వినియోగదారుల పేరిట సిలిండర్లు బుక్‌చేసి ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే పొరపాటు అయిందని దాటవేస్తున్నారు. వినియోగదారులకు సబ్సిడీ జమవుతున్నా..సిలిండర్లను డీలర్లు ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరో వైపు గృహ అవసరాల సిలిండర్లను వాణిజ్య సంస్థలకు చేరవేస్తున్నారు. మరో పక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లకు పాల్పడుతుండగా పౌరసరఫరాల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వినియోగదారులకే ఆంక్షలు...

వినియోగదారుడికి గ్యాస్ సిలిండర్ కావాలంటే మొదట బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత డెలివరీ సమయాన ఓటీపీ చెప్పాలి. ఇదంతా సామాన్య వినియోగదారులకే వర్తిస్తుండగా..కొందరు డీలర్లు ఇతరులకు మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా అమ్మేస్తున్నారని తెలుస్తోంది. ఏటా రెండు నుంచి మూడు సిలిండర్లను బుక్ చేసుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని వారి పేరిట బుక్ చేసి ఇతరులకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఈ సమయాన వినియోగదారుడి సెల్ నంబర్‌కు బుక్ చేసినట్లు, డెలివరీ అయినట్లు మెసేజ్‌లతో పాటు ఓటీపీ కూడా వస్తోంది. కానీ ఓటీపీ కోసం ఎవరూ ఫోన్ చేయడం లేదు. దీంతో డీలర్లే తాము అమ్ముకోదలచుకుంటే ఓటీపీతో పని లేకుండా ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఇష్టారాజ్యం...

వాణిజ్య అవసరాల కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించడానికి వీల్లేదు. కానీ ఆ సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు డీలర్లు హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. తోపుడు బండ్లపై నిర్వహించే టిఫిన్ సెంటర్లు మొదలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ సిలిండర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు రూ.500కే సిలిండర్ వస్తుండటం కొందరు ఏటా రెండు నుంచి మూడు మాత్రమే వాడుతుండడంతో వారి పేరిట సిలిండర్లు బుక్ చేసి వాణిజ్య అవసరాలకు మళ్లించి డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

డెలివరీ బాయ్స్ దందా..

డీలర్ల వ్యవహారం ఇలా ఉంటే సిలిండర్లు డెలివరీ చేసే సిబ్బంది తమ వంతుగా వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. ఐదు కిలో మీటర్ల వరకు సిలిండర్లను ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి. 30 కి.మీ అయితే రూ.10, అంతకు మించి దూరమైతే రూ.15 వసూలు చేసుకోవాలి. కానీ ఎక్కడైనా సరే సిలిండర్ తీసుకొస్తే చాలు రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరుసటి నెల ఆలస్యం చేయడమో లేదంటే డోర్ లాక్ చేసి అని దాటవేయడమో చేస్తున్నారని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నా పౌరసరఫరాల అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. డీలర్లు మాత్రం లెక్కా పత్రం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నా తనిఖీల మాటెత్తడం లేదు. గ్యాస్ గోదాంలో కానీ ఏజెన్సీలలో కాని తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

గ్యాస్ పంపిణీలో అక్రమాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. డెలివరీ ఇచ్చినట్లు మెసేజ్‌లపై ఫిర్యాదులు ఇస్తే చర్యలు తీసుకుంటాం. అంతే కాకుండా ఏజెన్సీలపై కూడా చర్యలు ఉంటాయి. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా తనిఖీ చేస్తున్నాం.

–నరసింహారావు, ఏఎస్‌వో, కామారెడ్డి

భారత్‌ను విశ్వ గురువు చేయడమే ప్రధాని కల

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన 15వ వార్డు నాయకులతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి క్రైం: భారత దేశాన్ని విశ్వ గురువుగా చేయాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ కల అని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 15వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు భూమేష్ యాదవ్‌తో పాటు పలువురు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వికసిత భారత్ కోసం ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. సభ్యత్వ నమోదు ప్రారంభమై 2 నెలలు పూర్తికాక ముందే 10 కోట్ల మంది బీజేపీలో సభ్యులుగా చేరారని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కామారెడ్డిలోని అన్ని వార్డుల్లో విజయం సాధించి బీజేపీ జెండాను ఎగురవేస్తామన్నారు.

పార్టీలో చేరిన మైనార్టీ యువకులు

కామారెడ్డి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన 12 మంది మైనార్టీ యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు.ఆదివారం క్యాంప్ కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పరామర్శ

రాజంపేట: తలమడ్ల గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చాకలి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలిసి ఎమ్మెల్యే ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నేతలు నరేందర్ రెడ్డి, సంపత్‌రెడ్డి, గంగారెడ్డి ఉన్నారు.



పార్టీ చేరిన యువకులతో ఎమ్మెల్యే కేవీఆర్

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న రాజ్‌కుమార్

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని మల్లికార్జున స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన మిద్దెల శివయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య మిద్దెల మల్లవ్వ, కుమారుడు రాజ్‌కుమార్‌లు రూ.11 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు బోజన్నగారి రాజు పాటిల్, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, కోశాధికారి గుడెల్లి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సోమారం తండాలో ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. ఉపాధ్యక్షులు గణేష్, బీసీ సెల్ అధ్యక్షుడు బాలయ్య, టౌన్ అధ్యక్షుడు మెట్టు రామ చందర్, గ్రామ అధ్యక్షుడు రామచందర్, భాస్కర్, చరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేమ్ టూ సేమ్.. పరేషాన్

భిక్కనూరు: రాత్రి వేళ బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడికి రోడ్డుపైన అక్కడక్కడా కరెన్సీ నోట్లు పడి ఉండటం గమనించాడు. డబ్బులు దొరికాయని లోలోపల ఆనందంతో పొంగిపోయాడు. బైక్‌ను ఆపి ఆ నోట్లను ఏరి తీసుకున్నాడు. వాటిని తనివి తీరా చూడగా అసలు నోట్లను తలపించాయి. కాని డౌట్ వచ్చి వాటిని పరిశీలించగా ఆ నోట్లు నకిలీవని తెలిసింది. దీంతో ఆ యువకుడి ఆశలు అడియాశలు అయ్యాయి. ఆ నోట్లు దుకాణాల్లో పిల్లలు ఆడుకోవడానికి తయారు చేసి అమ్ముతున్నవని అని తెలిసి షాక్‌కు గురి అవ్వడం ఆ యువకుడి వంతయ్యింది. సేమ్ టూ సేమ్ అన్నట్లు ఒరిజినల్ నోట్లు మాదిరిగా తయారు చేసి విక్రయిస్తున్న ఈ పేపర్ నోట్లతో వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు, నిరక్షరాస్యులు, గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. అసలు నోట్లు ఏవో నకిలీవి ఏవో గుర్తించలేక పోతున్నారు. ఇలాంటి పేపర్ నోట్ల తయారీ, విక్రయాలను నిషేధించాలని అందరూ కోరుతున్నారు.



కరెన్సీ నోట్లను పోలి ఉన్న కాగితం నోట్లు

ఘనంగా త్రిమూర్తి ఎంటర్‌ప్రైజెస్ వార్షికోత్సవం



వేడుకల్లో కొండా వీరశేఖర్ గుప్తా, యజమానులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న త్రిమూర్తి ఎంటర్‌ప్రైజెస్ వార్షికోత్సవాలను వ్యవస్థాపకుడు, యజమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి ఎంటర్ ప్రైజెస్ ఫౌండర్ కొండా వీరశేఖర్ గుప్తా తమ దుకాణంలోని సోఫాలు, డైనింగ్ టేబుళ్లు, ఆఫీస్ ఫర్నిచర్, మంచాలు, స్టీలు, ఉడెన్ ఫర్నీచర్లు సరసమైన ధరలకు లభిస్తున్నాయని తెలిపారు. 1975లో ప్రారంభమైన త్రిమూర్తి ఎంటర్ ప్రైజెస్ నేడు 49 ఏళ్లు ముగించుకుని 50 సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. నాణ్యతకు మారుపేరుగా, నాణ్యమైన ప్రమాణాలతో కుడిన ఫర్నిచర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొండ పవన్, పవిత్ర, లక్ష్మణ్ ప్రసాద్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు బాపురెడ్డి మృతి



బాపురెడ్డి(ఫైల్)

నిజామాబాద్‌నాగారం: ప్రముఖ వైద్యుడు, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బాపురెడ్డి(75) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. కొంత కాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. జిల్లాలో ఫిజీషియన్‌గా నాలుగు దశాబ్దాలుగా సేవలందించారు. కరీంనగర్ జిల్లా ఇల్లంతుకుంట మండలం అనంతగిరికి చెందిన బాపురెడ్డి బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడుగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఐఎంఏలోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. బాపురెడ్డి మృతిపై పలువురు వైద్యులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. తెలంగాణ అంటే తన ప్రాణం.. తెలంగాణను ఎవరైనా విమర్శిస్తే తట్టుకోలేని శక్తి.. వ్యక్తి అతనే డాక్టర్ బాపురెడ్డి అని జేఏసీ ప్రతినిధులు గోపాల్‌శర్మ, గైని గంగారాం, భాస్కర్, ప్రభాకర్, మోహన్, నజీర్ మాధవ్ అన్నారు. ఆయనకు ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.

అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయిస్తా



రెంజల్: అసంపూర్తిగా మిగిలిపోయిన రెంజల్ శాఖా గ్రంథాలయాన్ని త్వరలో పూర్తి చేయిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి అన్నారు. ఆదివారం ఆకస్మికంగా రెంజల్ శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. పక్కా భవనం లేక అద్దె భవనంలో నెట్టుకొస్తున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన అసంపూర్తి భవనాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం అద్దె భవనంలో సాగుతున్న గ్రంథాలయాన్ని తనిఖీ చేసి కార్యదర్శి లేకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల కన్వీనర్ నితిన్, నాయకులు సాయిబాబాగౌడ్, పోచయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

రైల్వేస్టేషన్‌లో నిందితుడి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి

ఖలీల్‌వాడి: రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి వద్ద ఉన్న రెండు ఎల్‌ఈడీ టీవీలను దొంగిలించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. ధర్మాబాద్‌కు చెందిన మాధవప్ప ఈనెల 26న జిల్లా కేంద్రంలో 32 ఇంచులకు చెందిన రెండు ఎల్‌ఈడీ టీవీలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైలు ఆలస్యంగా ఉండడంతో బుకింగ్ కౌంటర్ వద్ద మాధవప్ప టీవీలను పక్కన పెట్టి నిద్రించారు. అదే సమయంలో అక్కడే ఉన్న మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన శంకర్ నాగూరావు మాధవప్ప టీవీలను ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం ఒకటో నంబర్ ప్లాట్ ఫాంపై శంకర్ నాగూరావు టీవీలను చేతిలో పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఐడీ పార్టీ పోలీసులు పట్టుకొని విచారించగా టీవీలు దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఇందులో ఆర్పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి, ఆర్ఎస్సై ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘు పతి పేర్కొన్నారు. నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఎస్బీఐ గోడౌన్ రోడ్డు బ్రాంచ్ ఏటీఎంను ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించి న హైదరాబాద్ కు చెందిన గ్యాన్ ప్రకాశ్ చౌహాన్ ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



సమ్మేళనంలో పాల్గొన్న రెంజర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



ఎర్రాపహాడ్‌లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

బాల్కొండ/ వర్ని/ రాజంపేట/ తాడ్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అ‘పూర్వ’ సమ్మేళనాలు చేపట్టారు. ముప్కాల్ మండలం రెంజర్లలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–2006, వర్ని మండలం వడ్డేపల్లి గ్రామోదయ ఉన్నత పాఠశాలలో 1981–82, రాజంపేట మండలం బసవన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–2004, తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ ఉన్నత పాఠశాలలో 2001–2002కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు చేపట్టారు. అందరూ ఒకే చోట చేరడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.



బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



గ్రామోదయ పాఠశాల విద్యార్థులు



బస్వన్నపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

క్రీడా స్ఫూర్తి చాటాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజాగౌడ్

జక్రాన్‌పల్లి: క్రీడా పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆర్డీవో రాజాగౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండలంలోని మునిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల డిగ్రీ కళాశాలలో అండర్–14, 19 క్రీడా పోటీలను ఆర్డీవో ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి, మునిపల్లి చీమన్‌పల్లి ప్రిన్సిపాళ్లు అనూష, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మోపాల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, ప్రతి విద్యార్థి క్రీడాపోటీల్లో భాగస్వాములు కావాలని బీసీ గురుకులాల ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి జిల్లాల బీసీ గురుకులాల బాలుర అండర్–14, 19 మూడు రోజుల క్రీడా పోటీలను మోపాల్ మండలంలోని కంజర్ మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మురళీ, ఇన్‌చార్జి పీడీ రంజిత్, పీఈటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంజర్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మామిడి చిన్నమ్మ, మామిడి బాలవ్వ, మామిడి సాయిలు పొలంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొన్నది. ఈ ఘటనలో బాలవ్వకు గాయాలు కాగా, సాయిలుకు కాలు విరిగింది. చిన్నమ్మ తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

కారు–బైక్ ఢీకొని మరొకరికి..

బాన్సువాడ: బీర్కూర్ మండలం దామరంచ శివారులో ఆదివారం సాయంత్రం కారు–బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బీర్కూర్‌కు చెందిన అప్సర్ బాన్సువాడ నుంచి బీర్కూర్‌కు బైక్‌పై వస్తుండగా బీర్కూర్ నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ఘటనలో అప్సర్‌కు తీవ్ర గాయాలు కాగా బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని అమ్దాపూర్ శివారులో శనివారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,520 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తాం



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు భాస్కర్

నిజామాబాద్ సిటీ: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని, అందుకు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్యోతి, పాలడుగు భాస్కర్, రమ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 23వ జిల్లా మహాసభ ముగింపు కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు జమిలి ఎన్నికలు తీసుకురావాలని యోచిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద దాడులను ప్రోత్సహిస్తోందన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు తెస్తానన్న ఎంపీ అర్వింద్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడంతో కార్మికులపై పనిభారం పెరుగుతుందని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రతతో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని తెలిపారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, శంకర్‌గౌడ్, ఆనంద్, సుజాత, యేషల గంగాధర్, రామ్మోహన్ రావు, కొండ గంగాధర్, నన్నెసాహెబ్, విఘ్నేష్, జంగం గంగాధర్, శిల్పలింగం, నాయక్ వాడి శ్రీనివాస్, కటారి రాములు, నాయకులు పాల్గొన్నారు.